సాక్షి పల్నాడు

శుక్రవారం ׀ 15 ׀ ఆగస్టు ׀ 2025

I



గ్రామదేవతలకు చద్ది సమర్పణ

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మ వార్లకు గురువారం చద్ది సమర్పించారు. భక్తులు పూజలు జరిపారు.



వెలుగు కార్యాలయంలో ఆడిట్

బొల్లాపల్లి : స్థానిక వెలుగు పథకం కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిధులకు సంబంధించి ఆడిట్ జరిగింది.



డీఎల్‌పీవో పర్యటన

నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాన్ని డీఎల్‌పీవో లక్ష్మణరావు గురువారం సందర్శించారు. ఖాళీ స్థలాలు, ఇళ్లకు కొలతలు వేసి గుర్తింపు పత్రాలు అందిస్తామన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా అమరేశ్వర స్వామి వార్ల పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితులు మండప పూజ, దీక్ష హోమం, రుద్ర హోమం, పవిత్ర ధారణ, చండీ హోమం జరిపి హారతి మంత్ర పుష్పాలు సమర్పించారు. అనంతరం స్వామి వార్లకు పట్టు పవిత్రములు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ మాట్లాడుతూ విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా 11 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

ఎయిమ్స్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్ ఏర్పాటు




మంగళగిరి టౌన్ : తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అమృతధార బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్‌ను పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ రాజ్యలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఎయిమ్స్ ఆసుపత్రికి వచ్చే తల్లులు తమ చిన్నారులకు పాలు ఇవ్వడానికి సుమారు రూ. 1,50,000 విలువతో అమృత ధార బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్‌ను ఏర్పాటు చేశామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. తల్లులు ఈ క్యాబిన్‌లో సౌకర్యవంతంగా కూర్చొని బిడ్డలకు పాలిచ్చేందుకు రెండు సోఫాలు ఏర్పాటు చేశామన్నారు. ఎయిమ్స్ వైద్యులు మాట్లాడుతూ క్యాబిన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, రోటరీ సేవలను కొనియాడారు. అనంతరం రోటరీ ప్రతినిధులు బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్రరావు, రోటరీ క్లబ్ తాడేపల్లి అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, కార్యదర్శి శ్రావణి, కోశాధికారి నగేష్, పాస్ట్ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానందరెడ్డి, క్లబ్ సభ్యులు శ్రీరామిరెడ్డి, కళ్ళం రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరస్వామి వారి దేవస్థానానికి కొత్త ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రేఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవా తపన కలిగిన భక్తులు, సేవాభావంతో ఉన్న దాతలు ట్రస్ట్ బోర్డులో సభ్యులుగా నియామకానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. తమ దరఖాస్తులను ఫారం-1 నమూనాలో పూర్తి చేసి ఈ నెల 5వ తేదీ నుంచి 20 రోజులలోపు స్వామివారి దేవస్థానం సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి వారి కారాలయములో సమర్పించాలన్నారు. కొత్తగా ఏర్పడనున్న ట్రస్ట్ బోర్డు ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదల, సేవా కార్యక్రమాల విస్తరణ నిర్వహిస్తుందన్నారు.

అగస్త్య లాంచీ ట్రయల్ రన్ విజయవంతం



విజయపురిసౌత్: గత మూడు నెలలుగా నిలిచిపోయిన ఎంఎల్ అగస్త్య లాంచీ మరమ్మతులు పూర్తికావడంతో గురువారం నాగార్జున కొండకు ట్రయల్ రన్ నిర్వహించారు. గత ఆదివారం పర్యాటక శాఖ జీఎం చందన నాంచారయ్య ఆధ్వర్యంలో లాంచీ స్టేషన్‌లో అగస్త్య లాంచీ మరమ్మతు పనులను చేపట్టారు. అగస్త్య అందుబాటులోకి రావడంతో శ్రీశైలంతో పాటు నాగార్జున కొండకు పర్యాటకులను చేరవేసేందుకు అధికారులు సన్నద్ధం అయ్యారు. ఈ కార్యక్రమంలో లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా ,పులుసు వీరారెడ్డి పాల్గొన్నారు.

వీడని వరద కష్టాలు



పెదకూరపాడు మండలం జలాపురం గ్రామంలో భారీ వర్షాలకు నీరు ప్రవహించడంతో నేలవాలిన పత్తి పంట

గురువారం తెల్లవారుజామున వరకు కొనసాగిన భారీ వర్షాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- రాజుపాలెం మండలంలో బలిజేపల్లి వద్ద ప్రమాదక స్థాయిలో వర్షపు నీరు
- వర్షాలకు దెబ్బతిన్న ముదురు పత్తి, కంది, వరి పంటలు
- 2,561 హెక్టార్లలో పంట నీట మునిగిందంటున్న వ్యవసాయశాఖ

సాక్షి, నరసరావుపేట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. పగటి పూట వర్షం పడకపోవడంతో రైతులు, ప్రజలు కొంత ఊపిరిపీల్చుకున్నారు. మంగళ, బుధవారాల్లో కురిసన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ప్రమాదకరంగా ప్రవహించిన వాగులు, వంకలు కొంతమేర శాంతించాయి. అయినప్పటికీ గురువారం కూడా చప్టాలపై వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. పంట పొలాలలో నీరు తగ్గడంతో మొక్కలు మేట పడిన దృశ్యాలు కనిపించాయి. రాజుపాలెం మండలం బలిజేపల్లి దగ్గర చప్టాపై వర్షపునీరు ప్రవహించడంతో బలిజేపల్లి-ఉప్పలపాడు మధ్య రాకపోకలకు కొంత సమయం అంతరాయం కలిగింది. అమరావతి మండలం పెదమద్దూరు వద్ద లోలెవల్ బ్రిడ్జిపై ఐదు అడుగుల మేర వర్షపు నీరు ప్రవహించింది. దీంతో ఉదయం వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. గురజాల మండలం మాడుగుల వద్ద ఎద్దుల వాగు, చర్లగుడిపాడు జంగమేశ్వరపురం మధ్య నల్లవాగు, రెంటచింతల మండలంలో గోలివాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మాచవరం మండలం శ్రీరుక్మిణిపురం వద్ద పిల్లేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో శ్రీరుక్మిణిపురం, పిల్లుట్ల, బెల్లంకొండ, పిడుగురాళ్ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పెదకూరపాడు మండలం పాటిబండ వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉన్న ఓగేరు, కుప్పగంజి, దంతెనవాగు, నక్కవాగు, ఉప్పవాగు, కొండవాగు, వేదమంగళ వాగు ఇప్పటికే వరద నీటితో ఉధతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు కొనసాగితే ఈ వాగులు మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లేరు వాగు



క్రోసూరులో నీట మునిగిన పత్తి మొక్కలు

2,561 హెక్టార్లలో నీట మునిగిన పంటలు

భారీ వర్షాలవల్ల పంట పొలాలలో వర్షపునీరు భారీగా చేరి పంటలు నీట మునిగాయి. అమరావతి, క్రోసురు, పెదకూరపాడు, రెంటచింతల మండలాల పరిధిలో పత్తి, కంది, వరి పంటలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు గురువారం ప్రకటించారు. మొత్తం 2,561 హెక్టార్లలో పంట నీటమునగగా అందులో 2,530 హెక్టార్లలో పత్తి, 20 హెక్టార్లలో వరి, 11 హెక్టార్లలో కంది పంట నీటమునిగింది. వర్షాలు కొనసాగి, వర్షపునీటిలో మొక్కలు మునిగితే నష్టం అపారంగా ఉండనుంది. జిల్లాలో ఉద్యానపంటల సాగు పూర్తిస్థాయిలో మొదలుకాకపోవడం వల్ల పంటలకు పెద్దగా నష్టం లేదని అధికారులు తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే.

జిల్లా వ్యాప్తంగా 120 సెంటీమీటర్ల వర్షం

బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 120 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో వ్యాప్తంగా సగటున 4.32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నకరికల్లు మండలంలో 9 సెంటీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా రెంటచింతలలో 0.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెల్దుర్తి, కారంపూడి, రాజుపాలెం మండలాల్లో 7 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. ఆగస్టు మాసం 14వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 6.31 సెంటీమీటర్లు పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 17 సెంటీమీటర్ల వర్షపాతం పడింది.

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

- వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొననున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు



నరసరావుపేట రూరల్: 79వ స్వాతంత్య్ర వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. వేడుకలు నిర్వహించే ప్రాంగణాన్ని తివర్ణ పతాకాలతో అలంకరించారు. అతిథుల కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. వీవీపీల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు పరేడ్‌ను ప్రజలు తిలకించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకలకు రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పోలీసు, ఎన్‌సీసీ దళాల అనంతరం ముఖ్య అతిథి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సందేశం అందిస్తారు. తరువాత మువ్వన్నెల బెలూన్లు ఎగురవేయడం, స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం, శకటాల ప్రదర్శన ఉంటుంది. 10.15గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. 11.41గంటలకు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తారు. ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అతిథులు సందర్శించిన అనంతరం జాతీయ గీతాలాపనలో కార్యక్రమం ముగుస్తుంది.

ఏర్పాట్లు పరిశీలన..

పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు గురువారం పరిశీలించారు. ప్రధాన వేదిక, వీవీఐపీ, వీఐపీల గ్యాలరీలు, స్టాల్స్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళీ, ఆర్డీఓ మధులత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో మత్స్యకారులు



ఒడ్డుకు చేర్చిన బోట్లు

- కృష్ణా నదిలో క్రమేపీ పెరుగుతున్న వరద
- రామాపురం మత్స్యకారుల కాలనీకి పొంచి ఉన్న ప్రమాదం

దాచేపల్లి: కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మత్స్యకారుల కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి 2 లక్షల 33 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తూ ఉండటంతో దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల కాలనీ ప్రమాదం పొంచి ఉంది. క్రమేపీ కృష్ణా నదిలో వరద ఉధృతి పెరుగుతుండడంతోపాటు సమీపంలోని వాగులు, కాలువలు పొంగి ప్రవహించి వరద నీరంతా కృష్ణా నదిలో చేరుతుంది. రామాపురం మత్స్యకారుల కాలనీలో 50 పైగా మత్స్యకారుల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా కృష్ణా నదిలో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తూ ఉన్నారు. కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం పెరిగిన ప్రతిసారి మత్సకారులు నివాస గృహాలను ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి తరలి వెళ్లాల్సిన పరిస్థితి. తాజాగా కృష్ణానది ఉగ్రరూపం దాల్చుతుండటంతో ఏ క్షణానైనా మత్స్యకారులను ఖాళీ చేసి పునరావస కేంద్రానికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరగడంతో గత వారం రోజులుగా మత్స్యకారులు చేపల వేటను పూర్తిగా నిలిపివేశారు. బోట్లను నది ఒడ్డున లంగర్లు వేసి నిలిపివేశారు. వరద ఉధృతికి వలలు నదిలో కొట్టుకుపోయాయి. చేపల వేట నిలిచిపోవడం వల్ల తమకు ఇబ్బందికరంగా ఉందని, ప్రభుత్వం తమను ఆదుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు. మత్స్యకారుల కాలనీని తహసీల్దార్ కే.శ్రీనివాస్ యాదవ్ పరిశీలించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ సిబ్బందిని అక్కడ కేటాయించి నదిలో నీటి ప్రవాహం పెరిగితే ఇళ్లను ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



రామాపురం మత్స్యకారుల కాలనీని ఆనుకొని ప్రవహిస్తున్న కృష్ణా నది

ఎక్కడో ఎందుకు.. ఇక్కడే తాగండి

మద్యం ప్రియులు ఇప్పటి వరకు చెట్ల కింద, రోడ్ల వెంట తాగుతూ భయపడుతున్నారు. ఇకపై ఆ భయం అవసరం లేదు. ఎందుకంటే వైన్ షాపుల్లోనే సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మద్యం దుకాణంలో ఒక ఫుల్ బాటిల్ తీసుకుంటే.. ఉత్తరం గదిలో గ్లాసులు, మంచింగ్, దక్షిణం గదిలో టేబుళ్లు ఏర్పాటుచేస్తున్నారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకుంది. పర్మిట్ రూముల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది.

వైన్ షాపుల్లో పర్మిట్ రూములు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి

- మందుబాబులకు మద్యంతోపాటు సకల సౌకర్యాలు
- ఇప్పటికే నియంత్రణ లేక ఛిద్రమవుతున్న కుటుంబాలు
- పర్మిట్ రూములతో మరింత పెరిగే అవకాశం
- తీవ్రంగా మండిపడుతున్న ప్రజా, మహిళా సంఘాలు

నరసరావుపేటటౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ప్రైవేటు పెత్తనాన్ని పక్కకు నెట్టేసి ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. ఇదే సమయంలో ప్రజలను మద్యానికి దూరం చేయాలనే సంకల్పంతో కొన్ని బ్రాండ్ల విక్రయాన్ని నిలిపేసింది. మరో వైపు పేదలకు అందుబాటు ధరలో ఉంచకుండా చర్యలు తీసుకుంది. ఇలా మద్యం నియంత్రణకు తీవ్రంగా కృషి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు సరికొత్త మద్యం పాలసీని ప్రవేశపెడుతున్నామని చెబుతూనే.. గత వైఎస్సార్ సీపీపై విపరీతమైన విమర్శలు గుప్పించారు. మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం నియంత్రణతోపాటు డ్రగ్ ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించారు. కానీ అధికారం చేపట్టిన వెంటనే మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి తీసుకెళ్లారు. వేళాపాళా లేకుండా మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో రాత్రి వేళ మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మరో వైపు అర్ధరాత్రి ఘర్షణలు జరుగుతున్నాయి. గత ఏడాదిగా క్రైమ్ రేటు పరిశీలిస్తే మద్యం మత్తులోనే ఎక్కువగా నేరాలు జరిగినట్లు తెలుస్తోంది. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారుతోంది. నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారుల కళ్లకు మామూళ్ల మత్తు కమ్మడంతో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఈ క్రమంలో మద్యం దుకాణాల వద్ద ఘర్షణలు పెరిగిపోయాయి. వీటిపై దృష్టి సారించి మందుబాబులను కట్టడి చేయాల్సిన సీఎం చంద్రబాబు ప్రభుత్వం.. తాజాగా పర్మిట్ రూములకు పర్మిషన్ ఇచ్చేసింది. ఎక్కడో ఎందుకు.. ఇక్కడే తాగండి.. తాపించండి.. అంటూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.



నరసరావుపేటలోని ఓ మద్యం దుకాణం

జిల్లాలో 129 పర్మిట్ రూమ్‌లు

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 129 మద్యం దుకాణాలు ఉండగా వాటికి అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు రానున్నాయి. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం రెండు కేటగిరీలుగా విభజించింది. ఇందులో 5 లక్షల జనాభాలో లోపు ఉన్న మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లకు వార్షిక ఫీజు రూ.5లక్షలుగాను, 5 లక్షల నుంచి 7.5 లక్షల జనాభా గల మద్యం దుకాణాలకు వార్షిక ఫీజు రూ.7.5 లక్షలుగాను నిర్ణయించారు. జిల్లాలో రూ.5 లక్షల పరిధిలో వచ్చే పర్మిట్ రూమ్‌లు 33 ఉండగా, రూ.7.5 లక్షల ఫీజు చెల్లించాల్సిన దుకాణాలు 96 ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి ఎక్సైజ్ శాఖకు రూ.8.85 కోట్ల ఆదాయం రానుంది.

కుటుంబాలు రోడ్డున పడతాయి



కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం విధానం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు నేడు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. విచ్చలవిడిగా మద్యం దొరకడం వల్ల మద్యం బాబులు రెచ్చిపోయి తాగుతున్నారు. సంపాదనంతా మద్యానికి పెడుతుండటంతో అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి. అది చాలదన్నట్లు మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇవ్వడం మరి దారుణం.

–బొబ్బిలి శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు

మద్యంతోనే అనర్థాలన్నీ...



చంద్రబాబు మొదటి సారి సీఎం అవ్వగానే అప్పటి వరకు ఎన్‌టీఆర్ అమలు చేసిన సంపూర్ణ మద్య నిషేధానికి తూట్లు పొడిచాడు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వీలైనంతగా మద్యం విక్రయాలను తగ్గించి దశలవారీగా మద్యనిషేధానికి చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడమంటే పరోక్షంగా నేరాలను ప్రోత్సహించడమే. ప్రభుత్వం ఇచ్చిన జీవోపై పునరాలోచించి తక్షణమే రద్దు చేయాలి.

–ఈదర గోపీచంద్, గాంధేయవాది, నరసరావుపేట

మృత్యువులోనూ వీడని బంధం

- గుండె పోటుతో భర్త మరణం... తట్టుకోలేక భార్య మృతి
- నడికుడిలో అలుముకున్న విషాద ఛాయలు

దాచేపల్లి : వృద్ధాప్యానికి చేరువలో ఉన్న ఆ దంపతులు ఊహించని రీతిలో మృత్యువాత పడ్డారు. భర్త గుండెపోటుతో మృతి చెందగా, ఆ తర్వాత గంటల వ్యవధిలోనే భార్య కూడా గుండెపోటుకు గురై మృతి చెందింది. అకాల మృత్యువు భార్యాభర్తలను విడదీయలేక పోయింది. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ నడికుడిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి ...

షేక్ మాబు (60), షేక్ ఇమాంబి (56) దంపతులు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. మాబు ముజవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం స్వల్ప అస్వస్థతకు గురైన మాబు రాత్రి 9 గంటల సమయంలో గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. మృతదేహం వద్ద భార్య ఇమాంబి గుండెలు పగిలేలా రోధించింది. కుమారులు, కుమార్తె ఏడుస్తున్న తీరు చూపరుల కంటతడి పెట్టించింది. భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న ఇమాంబి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృత్యుఒడికి చేరింది. గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందడం నడికుడిలో విషాదాన్ని నింపింది. మృతదేహాలను చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు భారీగా తరలివచ్చారు.



షేక్ మాబు, ఇమాంబి దంపతులు (ఫైల్)

మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా!

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్య్రం కోసం అనేక మంది ప్రాణత్యాగం చేశారు. అలాంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటుచేసుకుని ప్రతి ఏటా వారిని స్మరించుకుంటాం. ఆ మహనీయులకు తీరని అవమానం జరిగింది. పిడుగురాళ్లలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జమునా స్కూల్) ఆవరణలో జాతిపిత మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, పొట్టి శ్రీరాములు, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలను ఏర్పాటుచేశారు. మూడేళ్ల కిందట పాఠశాల పునఃనిర్మాణం చేపట్టారు. విగ్రహాలను తీసి పక్కన పెట్టారు. విగ్రహాలను పునఃప్రతిష్ట చేయలేదు. – పిడుగురాళ్ల



చెట్ల పొదల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలు

క్లుప్తంగా

జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట రూరల్: జిల్లాలో భూగర్భ జల నీటిమట్టం గతేడాది కన్నా 2.26 మీటర్లు పెరిగిందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. నీటి వనరులపై సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సాగునీటి సంఘం సభ్యులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలం 30 మీటర్లు అడుగున ఉండే బొల్లాపల్లి మండలం, వెల్దుర్తి మండలాల్లో సైతం వరుసగా ఆరు మీటర్లు, మూడు మీటర్లు పెరిగిందని తెలిపారు. జిల్లాలో పెద్దఎత్తున ఫారం పాండ్లు నిర్మాణాల వలన వచ్చే ఏడాదికి భూగర్భ జల మట్టం పెరిగే అవకాశం ఉందని వివరించారు. సమగ్ర నీటి నిర్వహణలతో సాగునీటి సంఘ సభ్యులను, రైతులను భాగస్వాములను చేస్తామని తెలిపారు. పదిహేను రోజుల్లో అన్ని ప్రాజెక్టులకు మరమ్మతులు, కాల్వలో పూడిక తీత పనులు పూర్తికావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలమట్టం 20 మీటర్లు, 10 మీటర్లు దిగువున ప్రాంతాల్లో జల మట్టం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రీయ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కాంతారావు, చీఫ్ ఇంజినీర్ బి.శ్యామ్‌ప్రసాద్, ఎస్ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

20 లోపు అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోవాలి

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతుల కోసం అన్నదాత సుఖీభవ పోర్టల్ రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాడ్యూల్ 20వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవకు అర్హులై ఉండి, లబ్ధి పొందని రైతులు ఈ నెల 20వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ గ్రీవెన్స్‌ను మాడ్యూల్‌లో పొందుపరచి తగిన పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

పొంగిపొర్లుతున్న వాగులు

- చిలకలూరిపేట నియోజకవర్గంలో హై అలర్ట్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల విజ్ఞప్తి


ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం వద్ద పెరిగిన వాగు ఉధృతి


గణపవరంలో భారీ వరద నీటితో కుప్పగంజి వాగు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో ఉన్న ఓగేరు, కుప్పగంజి, దంతెనవాగు, నక్కవాగు, ఉప్పవాగు, కొండవాగు, వేదమంగళ వాగు ఇప్పటికే వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు కొనసాగితే ఈ వాగులు మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. వరద నీరు రోడ్లపై ప్రవహించే సమయంలో వాహనాలను నడపవద్దని, లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకల వద్దకు ఎవరూ వెళ్లరాదని పోలీసులు హెచ్చరించారు. లో-లెవెల్ వంతెనల వద్ద నీరు ప్రవహించే ప్రదేశాలలో ప్రజలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పహారా ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ వరద ముప్పు నుంచి తమను తాము రక్షించుకోవడానికి ప్రజలు అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొంగిన వాగులు – నిలిచిన రాకపోకలు

నాదెండ్ల: భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. గణపవరం-చిలకలూరిపేట డొంక రోడ్డులోని కుప్పగంజివాగు లోలెవల్ చప్టాపై నాలుగడుగుల మేర వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు స్తంభించాయి. రెవెన్యూ సిబ్బంది రాకపోకలను నిలిపివేయించారు. తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్, ఎస్సై జి. పుల్లారావు వరద ఉధృతిని పరిశీలించారు. గణపవరం కుప్పగంజివాగు పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు నీట మునిగాయి. అమీన్‌సాహెబ్‌పాలెం, గొరిజవోలు రోడ్లపై వరదనీరు ప్రవహించింది. మరో రెండు రోజుల పాటు వర్షాల ప్రభావంతో వరద కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.


అమీన్ సాహెబ్‌పాలెంలో కుప్పగంజి వాగు వరద ప్రవాహం


గణపవరం లోలెవల్ చప్టాపై ప్రవహిస్తున్న కుప్పగంజి వాగు వరద నీరు


గణపవరం పరిధిలో నీట మునిగిన పంటపొలాలు

పలు స్టేషన్లలో రైళ్ల స్టాప్‌లు ఇవి..



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం ఈ కింద పేర్కొన్న స్టేషన్ల వద్ద నిలపనున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

- రైలు నంబర్ (12603) చెన్నై-హైదరాబాద్ రైలు ఈనెల 15వ తేదీ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిరియాలగూడ, నల్గొండ, రైల్వే స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుంది.
- (12733) తిరుపతి-లింగంపల్లి రైలు పిడుగురాళ్ల, నడికుడి, మిరియాలగూడ వయా గుంటూరు మీదుగా ఈనెల 15వ తేదీ నుంచి నడుస్తుంది.
- (17015) భువనేశ్వర్-సికింద్రాబాద్ రైలు ఈనెల 15వ తేదీ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిరియాలగూడ, నల్గొండ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.
- (17232) నాగర్‌సోల్-నరసాపూర్ రైలు వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈ నెల 18వ తేదీ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిరియాలగూడ, నల్గొండ, స్టేషన్ల మీదుగా నడుస్తుంది.
- (17643) చంగల్‌పట్టు-కాకినాడ పోర్ట్ రైలు ఈనెల 15వ తేదీ నుంచి మంగళగిరి, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.
- (17216) ధర్మవరం జంక్షన్-విజయవాడ రైలు గిద్దలూరు, మార్కాపూర్ రోడ్ స్టేషన్ల మీదుగా ఈ నెల 15వ తేదీ నుంచి నడుస్తుంది.
- (17255) నరసాపూర్-లింగంపల్లి రైలు నల్గొండ స్టేషన్ మీదుగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రయాణిస్తుంది.
- (17256) లింగంపల్లి-నరసాపూర్ రైలు నెల 15వ తేదీ నుంచి మంగళగిరి స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.
- (17625) కాచిగూడ-రేపల్లె రైలు విజయవాడ స్టేషన్ మీదుగా ఈనెల 15వ తేదీ నుంచి, (17212) యశ్వంత్‌పూర్ జంక్షన్-మచిలీపట్నం వయా గుంటూరు నుంచి కంభం స్టేషన్ మీదుగా ప్రయాణిస్తుంది.

వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్‌లో పల్నాడు యువత

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కమిటీలో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు యువ నేతలకు చోటు లభించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా నరసరావుపేటకు చెందిన షేక్ నాగూర్ వలి, జాయింట్ సెక్రటరీగా గురజాలకు చెందిన షేక్ అల్లాభక్షులకు చోటు కల్పించారు. ఈమేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది.

సీట్లు కేటాయింపు వెంటనే చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

లక్ష్మీపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి 20 రోజులు గడిచినా నేటికీ విద్యార్థులకు సీట్లు కేటాయింపు చేయలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 22న కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ, నేటి వరకు విద్యార్థులకు ఏ కాలేజీలో సీట్లు పొందారో తెలియజేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, నగర కార్యదర్శి ఏ.యశ్వంత్, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు ఎస్కే సుభాని పాల్గొన్నారు.

తటాకం కాదు మైదానం!



ఈ చిత్రం చూసి, ప్రభుత్వ పాఠశాలలో ఎంత మంచి స్విమ్మింగ్ పూల్ ఉంది.. అనుకుంటే బురదలో కాలేసినట్లే.. వారు అలా ఈత కొడుతుంది ఎటూపోయే మార్గంలేక నిలిచిపోయిన వర్షం నీటిలో.. బెల్లంకొండ జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండు రోజులుగా భారీవర్షాలు కురవడంతో వర్షపు నీరు పాఠశాల మైదానంలో నిలిచిపోయింది. మోకాళ్ల లోతు నీళ్లు ఉండడంతో చిన్నారులు గురువారం ఇలా ఈత కొడుతూ కనిపించారు. వర్షం పడిన ప్రతిసారి పాఠశాలలో ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు చెబుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు రోజుల తరబడి నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. - బెల్లంకొండ

రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు

తాడికొండ: రాజధాని నిర్మాణానికి మలి విడత భూ సమీకరణ అంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనలతో రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. గురువారం సీపీఎం బృందం రాజధానిలో పర్యటించింది. తుళ్లూరులోని ఆర్‌వీఆర్ నిర్మాణ సంస్థకు చెందిన వలస కార్మికుల గృహ సముదాయం వద్ద కార్మికులతో మాట్లాడుతూ కార్మికులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలో పనులు లేకపోవడం పెద్ద సమస్యగా ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పనులు చేసుకుంటుంటే స్థానికులు ఇళ్ల దగ్గరే ఉండే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజధాని నిర్మాణానికి భూములు తీసుకునేటప్పుడు అందరికీ పనులు కల్పిస్తామని చెప్పిన హామీ అమలు కావడం లేదన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు పేరం బాబురావు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, షేక్ జానీ, కాపారపు రామకృష్ణ, పి వెంకటేశ్వర్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత



వర్క్‌షాపునకు హాజరైన ప్రతినిధులు

సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్

ప్రత్తిపాడు: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం లాంలోని కృష్ణ ఆడిటోరియంలో ఐసీఏఆర్ - సీఆర్ఐడీఏ (సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రై లాండ్ అగ్రికల్చర్) హైదరాబాద్, ఆచార్య ఎన్.జి.రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఫుడ్, ల్యాండ్, వాటర్ సిస్టమ్స్ టు కంబాట్ ది క్లైమేట్ క్రైసిస్' అనే అంశంపై స్టేక్ హోల్డర్స్ కన్సల్టింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీ దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె. సింగ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న వాతావరణ సంక్షోభాలను వివరించారు. వాతావరణ ఉల్లంఘనలను గుర్తించి పరిశోధన, విధాన నిర్ణయాలు, పరిష్కారాలపై ప్రణాళికలను తయారు చేసి, తదుపరి ఐదు సంవత్సరాల కార్యాచరణలో చేర్చేందుకు నీతి ఆయోగ్‌కు తెలియజేయాలని సూచించారు. ఏఎన్‌జీఆర్ఏయూ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీ దేవి మాట్లాడుతూ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, ఆహార ఉత్పత్తి పెంపొందే దిశగా వ్యవసాయ పరిశోధనలు చేపట్టాలని సూచించారు. విస్తరణ డైరెక్టర్ డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ కరువును తట్టుకునే పంట రకాలను గుర్తించి, భూమి నీటి వనరులను సద్వినియోగపరుచుకునేందుకు అన్ని అనుబంధ విభాగాలు కలిసి పని చేయాలని తెలిపారు. వాతావరణ సంక్షోభాన్ని అధిగమించేందుకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం గుర్తింపు అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌జీఆర్ఏయూ డాక్టర్ జి. రామచంద్రరావు, డీన్ డాక్టర్ ఏ.వి. రమణ, సీఆర్ఐడీఏ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. ప్రభాకర్ పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన యువకుల కోసం గాలింపు

సాయంత్రానికి ఒక యువకుడి మృతదేహం లభ్యం



తాడికొండ: కృష్ణానది వరద ఉధృతికి తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో బుధవారం గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరిలో ఓ యువకుడి మృతదేహం సాయంత్రానికి లభ్యమైంది. వెంకటపాలెం నేషనల్ హైవే వంతెన పరిసర ప్రాంతంలో రెస్క్యూ టీమ్ సభ్యులు ఒకరి మృతదేహాన్ని కనుకున్నారు. మృతదేహం ప్రసంగి వీర ఉపేంద్రగా గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించారు. ఇసుక తోడే డ్రోజర్‌ను స్థానం మార్చేందుకు నదిలోకి దిగగా వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇద్దరు గల్లంతయ్యారు. మృతుడి స్వగ్రామం తెనాలి వద్ద పెదపాలెం కాగా ప్రస్తుతం తాడేపల్లిలోని సీతానగరంలో నివాసం ఉంటున్నారు.

ప్రణాళిక ప్రకారమే దారి దోపిడీ

మేడికొండూరు : మేడికొండూరు మండల పరిధిలో దారి దోపిడీ పక్కా పథకం ప్రకారమే జరిగిందని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4న రూ.70 లక్షల నగదు, కారును అపహరించుకు వెళ్లినట్లు విజయవాడలో నివాసం ఉంటున్న జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మేడికొండూరు పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జగదీష్ స్నేహితుడు రంజిత్ ఈ నెల 4న బంగారపు మట్టి (లంకె బిందెలు లాంటివి) ఉందని జగదీష్‌ను నమ్మించి కేజీ రూ. 50 లక్షలు చొప్పున రెండు కేజీలు ఉందని చెప్పగా అందుకు జగదీష్ తన వద్ద రూ.70 లక్షలు మాత్రమే ఉన్నాయని, మిగతావి రెండు రోజుల తర్వాత ఇస్తానని చెప్పడంతో అందుకు రంజిత్ అంగీకరించాడు. జగదీష్ తన కారులో సత్తెనపల్లి వచ్చి అక్కడ ఉన్న రంజిత్ మరో ఇద్దరు వ్యక్తులతో మాట్లాడి బంగారపు మట్టిని పరిశీలించాడు. అనంతరం ఎవరి కారులో వాళ్ళు విజయవాడ బయలుదేరారు. మేడికొండూరు సమీపంలోకి రాగనే ఇద్దరు వ్యక్తులు జగదీష్ కారును అడ్డగించారు. పోలీస్ దుస్తులలో ఉన్న వారు విజిలెన్స్ అధికారులం అంటూ, జగదీష్ కారులో ఉన్నవి రూ.70 లక్షల నగదు, కారు తీసుకొని పరారయ్యారు. వెంటనే జగదీష్ తన స్నేహితులకు ఈ విషయం తెలిపి, సత్తెనపల్లి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 13వ తేదీన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో సోరియాసిమ్ కంపెనీ వద్ద కార్లను తనిఖీ చేస్తుండగా ఈ కేసులో నిందితులైన అంకుష్, మహాదేవులు వారి వాహనంతో వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కారులో 40 లక్షల రూపాయల నగదు, ఆరు లక్షల రూపాయలు విలువ చేసే బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్నేహితుడిని నమ్మించి మోసగించిన ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజమండ్రికి చెందిన రంజిత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ చూపిన మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్, ఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుల్ జాన్ సైదా, బాజీ సాహెబ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

లంక వాసులు.. అప్రమత్తంగా ఉండండి !

- గ్రామాలో ప్రజలకు అధికారుల అవగాహన
- వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు పునరావాస కేంద్రాలకు రావాలి


అన్నవరపు లంకలో ప్రజలకు వరద ఉధృతి గురించి వివరిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర: రాష్ట్రంలో పలుచోట్ల కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి 6లక్షల క్యూసెక్కుల వరద నీటిని బుధవారం వదిలారు. ఈ నేపథ్యంలో మండలంలోని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎస్ఐ పి. కోటేశ్వరరావు సూచించారు. ఇద్దరు గురువారం కృష్ణా నది రేవులను పరిశీలించారు. అనంతరం లంక గ్రామాల ప్రజలతో వరద ఉధృతిపై మాట్లాడారు. నదిలోకి వరద నీరు చేరడంతో లంక గ్రామాల ప్రజలు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిపూట తప్పని పరిస్థితిలోనే పడవ నడపాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు నది వైపు రాకుండా గ్రామ పెద్దలు, సర్పంచులు, వీఆర్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 7లక్షల క్యూసెక్కుల వరకు వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల్లోని వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస కేంద్రాలకు తరలి రావాలని తెలిపారు. పాడి పశువులను ఇతర గ్రామాల్లోని బంధువుల ఇంటికి ముందుగానే తరలించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్వోలతో మాట్లాడారు. లంక గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని ఆదేశించారు. తూములూరు, హనుమాన్‌పాలెం, కొల్లిపర పాఠశాలల్లోని పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో రామారావు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు


లంక గ్రామాల నుంచి అరటి గెలలను పడవ ద్వారా ఒడ్డుకు తరలిస్తున్న రైతులు


లంక గ్రామాల నుంచి పశువులను తరలిస్తున్న రైతులు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 65.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 9.2 మి.మీ వర్షం పడింది. సగటున 27.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలంలో 52.6 మి.మీ., తుళ్ళూరు 42.4, తాడేపల్లి 36.8, దుగ్గిరాల 32.6, ప్రత్తిపాడు 31, చేబ్రోలు 26.6, తాడికొండ 26, మంగళగిరి 23.8, గుంటూరు పశ్చిమ 22, గుంటూరు తూర్పు 20.2, పెదనందిపాడు 18.6, వట్టిచెరుకూరు 18.6, కొల్లిపర 18.2, కాకుమాను 17.2, తెనాలి 16.2, పెదకాకాని మండలంలో 14.4 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 14వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 74.4 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 199.5 మి.మీ వర్షపాతం పడింది.